వాహనాల తనిఖీలు ముమ్మరం

కారులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎఫ్ఎస్టీ బృందాలు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 6: అక్రమంగా నగదు, మద్యం తరలిస్తున్న వాహనాలపై ఎన్నికల సంఘం అధికారులు దృష్టి పెడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు వాహన తనిఖీలు చేపడుతున్నట్లు జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ దశరథ్‌సింగ్ రాథోడ్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో నగదు, మద్యం, బహుమతులు వంటి వాటిని తరలించే వాహనాలపై ఎఫ్ఎస్టీ బృందాలు ప్రత్యేకంగా నిఘా పెడుతున్నాయని తెలిపారు. త్వరలో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

నేడు ఖైరతాబాద్ బీఆర్ఎస్ సమావేశం

బంజారాహిల్స్, ఏప్రిల్ 6: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించనున్నారని పార్టీ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్, నాయకులు డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్, కె.విప్లవ్‌కుమార్‌తోపాటు కార్పొరేటర్లు వెల్దండ వెంకటేశ్, మన్నె కవితారెడ్డి సహా ముఖ్యనాయకులు పాల్గొంటారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వంద శాతం పోలింగ్ లక్ష్యం

- తక్కువ ఓటింగ్ నమోదైన పోలింగ్ స్టేషన్లలో సిబ్బంది సర్వే
- దివ్యాంగుల ఓటింగ్‌పై ప్రత్యేక చర్యలు తీసుకోనున్న అధికారులు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 6: లోక్‌సభ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ నమోదు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తక్కువ ఓటింగ్ నమోదవుతున్న నియోజకవర్గాలపై దృష్టి సారించారు. వంద శాతం పోలింగ్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే 85 ఏండ్లు పైబడిన సీనియర్ సిటిజన్స్‌తో పాటు పర్సన్ విత్ డిజేబుల్(పీడబ్ల్యూడీ) ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్లను అందజేస్తున్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో సర్వే నిర్వహిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ అవసరం లేకుండా పోలింగ్ బూత్‌లకు వచ్చే దివ్యాంగ, 85 ఏండ్లు పైబడిన సీనియర్ సిటిజన్ల చిరునామాలు సేకరించి పోలింగ్ డే రోజు సదరు ఓటర్లకు వాహనాలు సమకూర్చేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. అయితే అర్హులైన ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోకపోవడంతో తక్కువ శాతం పోలింగ్ నమోదు కావడం పరిపాటిగా మారిపోయింది. దీంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తక్కువ పోలింగ్ నమోదైన పోలింగ్ స్టేషన్లలో అధికారులు పకడ్బందీగా ఇంటింటికీ సర్వే చేపడుతున్నారు. శనివారం యూసుఫ్‌గూడలో ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్ ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బంది సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాక్ ఏఈలు వెంకటేశ్, అభినవ్, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



యూసుఫ్‌గూడలో తహసీల్దార్ నయీముద్దీన్ ఆధ్వర్యంలో సర్వే చేస్తున్న ఎన్నికల సిబ్బంది

రోడ్డు విస్తరణలో భూమి కోల్పోతున్నం.. న్యాయం చేయండి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 6: రోడ్డు విస్తరణలో భూమిని కోల్పోతున్నం.. తమకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం చౌదర్‌గూడ రైతులు మన్నె జాన్‌వెస్లి, మన్నె మనోహర్, మన్నె సంజీవరావు, మన్నె రూఫస్ శంషాబాద్ తహసీల్దార్ నాగమణికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. చౌదర్‌గూడలోని తమ భూమి సర్వే నంబర్ 213లో 5.23 గుంటల భూమి ఉందని అన్నారు. చౌదర్‌గూడ-పెద్దషాపూర్ మధ్య గతంలో ఉన్న రోడ్డు కాకుండా 33పీట్లకు నిర్మాణం చేపడుతున్నారని చెప్పారు. అయితే రోడ్డుకు ఇరువైపుల ఉన్న భూములు తీసుకోవాల్సిన కాంట్రాక్టర్.. తమ భూమిలో నుంచి స్థలాన్ని తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఉన్న భూమిని ఎందుకు తీసుకోవడంలేదని వారు ప్రశ్నించారు. పాత హద్దురాళ్లను కాదని గత శుక్రవారం సర్వేయర్ కొత్త హద్దురాళ్ల ఏర్పాటు చేశారని తెలిపారు. దీంతో తమకు తీవ్రనష్టం జరుగుతుందని తెలిపారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

శంషాబాద్ తహసీల్దార్ నాగమణికి వినతిపత్రం అందజేస్తున్న చౌదర్‌గూడ రైతులు

మణికొండలో చలివేంద్రం ప్రారంభం

మర్రిచెట్టు సర్కిల్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ, ఏప్రిల్ 6: పెరుగుతున్న ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మర్రిచెట్టు సర్కిల్ వద్ద బిల్డర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వేసవిలో మండిపోతున్న ఎండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని అన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. స్వచ్ఛంద సంస్థలు, నాయకులు, వ్యాపారులు ముందుకు వచ్చి ప్రజాశ్రేయస్సు కోసం మరిన్ని చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పి.సత్యనారాయణ, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బీరప్ప, కౌన్సిలర్ వందన, శ్వేత, కోఆప్షన్ సభ్యులు సిద్ధప్ప, లక్ష్మి, నాయకులు రాఘవ రెడ్డి, రవికాంత్‌రెడ్డి, ఇంద్ర, అనిత, సంగీత, సుజాత, నరసయ్య, రాజేశ్, శివరాంరెడ్డి, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

రూ. 50వేల విరాళం అందజేస్తున్న మాజీ ఉపసర్పంచ్ రాజునాయక్ దంపతులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 6: అలీకోల్ మైసమ్మ ఆలయ పునర్నిర్మాణానికి ఎనుగు వసంతరెడ్డి, కార్తిక్‌రెడ్డి రూ.లక్ష, స్థానిక బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ రాజు నాయక్ దంపతులు రూ.50వేల విరాళం శనివారం అందజేశారు. ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు హేమ్లానాయక్, మాజీ సర్పంచ్ హోమ్లానాయక్, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, కిషన్, గోపాల్, రాంబాబు, లక్ష్మణ్, రామ, చందు ఆధ్వర్యంలో ఆలయాన్ని పునర్నిర్మాణం చేస్తున్నారు. అందులో భాగంగా దాతలు సహకరించాలని కోరడంతో స్పందించడం గొప్పవిషయమని పేర్కొన్నారు. ఆలయానికి పూర్వ వైభవం తీసుకువస్తామని గ్రామస్తులు చెప్పారు.

ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన

మణికొండలో మున్సిపల్ కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్వీప్ నోడల్ ఆఫీసర్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర

మణికొండ, ఏప్రిల్ 6: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రాముఖ్యాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకొని, ఉపయోగించుకోవాలని స్వీప్ నోడల్ ఆఫీసర్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. శనివారం మణికొండ మున్సిపల్ కార్యాలయం నుంచి గోల్డెన్ టెంపుల్ వరకు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. మానవహారం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటు అనే ఆయుధాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వందశాతం ఉపయోగించుకునేలా అవగాహన చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఈ సాయి మౌనిక, ఈఈ సంపత్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, కార్మికులు

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

సిబ్బందితో సమావేశమైన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ, ఏప్రిల్ 6: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు మంచినీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని జలమండలి లైన్‌మెన్లను బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర ఆదేశించారు. శనివారం ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ విభాగాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో భూగర్భ జాలలు అడుగంటడంతో నీటి ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. జలమండలి అధికారులు స్పందించి నీటి సరఫరాను పెంచి ప్రజలకు తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్నులో 5శాతం రాయితీని చెల్లింపుదారులకు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని బిల్ కలెక్టర్లకు ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఈఈ యాదయ్య, ఏఈ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరు ప్రాయంలోనే యోగా శిక్షకులు..

చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న యోగా గురువు అశోక్‌కుమార్

ఖైరతాబాద్, ఏప్రిల్ 6: యోగా విద్యకు వయస్సుతో నిమిత్తం లేదని, ఎవరైనా నేర్చుకోవచ్చు. నేర్చుకోవడమే కాదు.. నేర్పించే స్థాయికి ఎదిగారు ఆ చిన్నారులు. సోమాజిగూడలోని బోది స్కూల్ ఆఫ్ యోగాలో విద్య నేర్చుకొని చిరు ప్రాయంలోనే యోగా శిక్షకులుగా ఖ్యాతిని గడించారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముంబాయికి చెందిన ఏడేండ్ల ఆర్యాహి, హైదరాబాద్‌కు చెందిన లావణ్య (8), మీరా(12)కు బోది స్కూల్ ఆఫ్ యోగా వ్యవస్థాపక డైరెక్టర్ వి.అశోక్‌కుమార్ సర్టిఫికెట్లను బహూకరించారు. చిన్నారులు ఆర్యాహి, లావణ్య, మీరా మూడు నెలల కోర్సును విజయవంతంగా నేర్చుకున్నారని తెలిపారు. అన్ని మెళకువల్లో తర్ఫీదు నిచ్చామన్నారు. ప్రస్తుతం వారు స్వయంగా యోగా నేర్పించే నైపుణ్యాన్ని సొంతం చేసుకున్నారని చెప్పారు. ప్రపంచంలో ఇంత చిన్న వయస్సులో ఎవరూ శిక్షకులుగా మారలేదని, గిన్నీస్ బుక్ రికార్డులో ఎక్కాల్సిన ఘనత సాధించారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 6: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కిందపడి గాయపడిన ఘటన జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. జార్ఖండ్‌కు చెందిన సాకేత్‌కుమార్(35), కూకట్‌పల్లిలో ఉంటున్న సాయిరెడ్డి గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున దుర్గం చెరువు వైపు నుంచి కేబుల్ బ్రిడ్జి మీదుగా జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45కు బైక్‌పై వెళ్తున్నారు. బైక్ స్కిడ్ కావడంతో కిందపడిపోయారు. ఘటనలో సాకేత్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా సాయిరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని స్థానికులు ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. కాగా మద్యం మత్తులో బైక్ నడిపి ఉంటారని ఆనుమానంతో జూబ్లీహిల్స్ పోలీసులు రక్త నమూనాలు సేకరించారు. ర్యాష్ డ్రైవింగ్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నాలాల పూడికతీత పనులు ప్రారంభం

- క్యాచ్‌పిట్లలో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు
- నెలాఖరులో పనులు పూర్తి చేస్తాం : జీహెచ్ఎంసీ డీఈ

రాజ్‌నగర్ మక్తా ప్రాంతంలో నాలాలో వ్యర్థాలను తొలగిస్తున్న హిటాచి

ఖైరతాబాద్, ఏప్రిల్ 6: వర్షాకాలంలో వరద ముంపును నివారించేందుకు జీహెచ్ఎంసీ కార్యాచరణ ప్రారంభించింది. గతంలో నాలాల్లో వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల అనేక కాలనీలు, బస్తీలు జలమయమయ్యాయి. ఆ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని డీసిల్టింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సర్కిల్ 17 పరిధిలోని మూడు మేజర్ నాలాల్లో మూడు హిటాచి వాహనాలతో వ్యర్థాలను తొలగిస్తున్నారు. ఈ ఏడాది వర్షాకాలానికి నెల రోజులకు ముందే నాలాల్లో పూడిక తీస్తారు.

రూ. 80లక్షలతో పనులు..

ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని మూడు మేజర్ నాలాల్లో డీసిల్టింగ్ పనులు చేపట్టారు. అందులో తుమ్మలబస్తీ నుంచి రాజ్‌నగర్ మీదుగా నెక్లెస్‌రోడ్‌లోని ఎన్టీపీ వరకు, సోమాజిగూడలోని స్కిల్ ఆర్కెడ్ నుంచి ఎల్లారెడ్డిగూడ, మైత్రివనం వెనుక వైపులో ఉన్న నాలాను డిసీల్టింగ్ కోసం మూడు హిటాచి వాహనాలను ఉపయోగిస్తున్నారు. రూ. 85 లక్షలతో చేపట్టిన ఈ పనులు ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తి చేస్తామని జీహెచ్ఎంసీ డీఈ చైతన్య తెలిపారు. వీటితో పాటు ఖైరతాబాద్, ప్రసాద్ ఐమాక్స్, నిమ్స్, లక్కీ రెస్టారెంట్ ప్రాంతాల్లో క్యాచ్‌పిట్లలో పేరుకుపోయిన వ్యర్థాలను సైతం తొలగిస్తున్నామని తెలిపారు.

కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయండి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 6: రాష్ట్ర వ్యాప్తంగా రవాణా రంగంలో పనిచేసే కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం ఉపాధి పొందేందుకు ప్రైవేట్ ఫైనాన్సియర్ల వద్ద రుణాలు తీసుకుని ఆటోలను కొనుగోలు చేసుకుని ఆటో డ్రైవర్లు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పలు విధాలుగా ఛలాన్లు విధిస్తూ మరింత ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపించారు.

యాబై ఏండ్లు నిండిన ఆటో డ్రైవర్లకు పింఛను ఇవ్వడంతోపాటు ప్రమాదబీమా రూ. 10 లక్షలకు పెంచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయంగా జీవనోపాధి మార్గాలను చూపించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలి

విజ్ఞాన్ కళాశాల కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బండ్లగూడ, ఏప్రిల్ 6 : విద్యార్థి దశ నుంచి దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే బాధ్యత నేటి విద్యార్థులపై ఉందని విజ్ఞాన్ కళాశాలల చైర్మన్ గౌరీ సతీశ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విజ్ఞాన్ కళాశాలలో ఉగాది పండుగ సందర్భంగా సాంస్కృతిక దినోత్సవాన్ని నిర్వహించారు. డిగ్రీ ఫైనల్ఇయర్ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గౌరీ సతీశ్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో విద్యార్థులు తెలుగు పండుగల గురించి తెలుసుకోవడంతో పాటు తెలుగు సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉగాది రోజున చేసే పచ్చడిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.

కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, అధ్యాపకులు శ్రీలత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

21ఏండ్లుగా చలివేంద్రం

ఖైరతాబాద్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించిన సీఐ రాజశేఖర్, మహేశ్‌యాదవ్

ఖైరతాబాద్, ఏప్రిల్ 6: ఖైరతాబాద్‌లో శివలాల్‌యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 21ఏండ్లుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో రైల్వేగేట్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ట్రాఫిక్ సీఐ రాజశేఖర్, ఎస్సై మధు, ట్రస్ట్ చైర్మన్ మహేశ్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కె.రాజు, చంద్రశేఖర్, ప్రవీణ్‌యాదవ్, మనోహర్, రమాదేవి, ఆంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి

కాటేదాన్‌లో బీజేపీ జెండా ఆవిష్కరించిన మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 6: అన్నివర్గాల అభ్యున్నతికి బీజేపీ అహర్నిశలు కృషి చేస్తుందని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం కాటేదాన్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ పి.మల్లేశ్‌యాదవ్,ఎస్సీ మోర్చా చేవెళ్ల లోక్‌సభ ఇన్‌చార్జి జోగి రవి, డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్దన్, రావుల భాస్కర్, బొమ్మరాజు నర్సింహ, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి 'రాష్ట్రీయ కళామంచ్ సింగిడి'

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 6: ఈనెల 20నుంచి రెండు రోజుల పాటు రాష్ట్రీయ కళామంచ్ సింగిడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఏబీవీపీ హైదరాబాద్ మహానగర ప్రముఖ్ డాక్టర్ రామకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పృథ్వితేజ పాల్గొన్నారు.

మతతత్వ శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి

హిమాయత్‌నగర్ ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో పుస్తకం ఆవిష్కరిస్తున్న దివికుమార్, తదితరులు

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 6: బీజేపీ అండతో దేశంలో సంఘ్ పరివార్ శక్తుల ఆగడాలు పెరుగుతున్నాయని, వాటికి అడ్డుకట్టవేయాల్సిన అవసరం ఉందని జన సాహితి అధ్యక్షుడు దివి కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్ బోస్ అన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో మహారాష్ట్ర మాజీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎస్ఎం ముషిఫ్ రచించిన కర్కారే ఎవరు చంపారు? అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో సంఘ్ పరివార్, బీజేపీలు హిందూ మతాన్ని వారి కుటిల రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. విభిన్న మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్న దేశంలో ప్రజల మధ్య అశాంతిని నెలకొల్పే ప్రయత్నం బీజేపీ చేస్తున్నదని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, సినీ దర్శకుడు సి.ఉమామహేశ్వర్‌రావు, సామాజిక శాస్త్రవేత్తలు డాక్టర్ సోమమర్ల, డాక్టర్ అజయ్ శర్మ, ఆల్ ఇండియా ప్రొగ్రెసివ్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బి.స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్రగాయాలు

వెంగళరావునగర్, ఏప్రిల్ 6: ఇంటర్వ్యూకు వెళ్లి తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొని యువతికి తీవ్ర గాయాలైన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన ప్రశాంతి(24) ఏడాది క్రితం ఉద్యోగం నిమిత్తం నగరానికి వచ్చి అమీర్‌పేట శివబాగ్‌కాలనీలోని హాస్టల్‌లో ఉంటుంది. శనివారం ఉదయం ఎస్ఆర్‌నగర్‌లోని ఓ సంస్థ కార్యాలయానికి ఇంటర్వ్యూకు వెళ్లింది. తిరిగి హాస్టల్‌కు నడుచుకుంటూ బయలుదేరింది. ఐసీఐసీఐ బ్యాంకు వద్ద రోడ్డు దాటుతుండగా అమీర్‌పేట వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు యువతిని ఢీకొట్టారు. దీంతో ఆమె కాలు విరిగి, తలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జనజాతర సభకు తరలిన కార్యకర్తలు

ఫిలింనగర్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, ఏప్రిల్ 6: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన జనజాతర సభకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు. శనివారం ఫిలింనగర్ నుంచి ర్యాలీగా సభా ప్రాంగణానికి బయలుదేరారు.ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, మామిడి నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో 'ఈసీఈ డే'

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 6 : భోలక్‌పూర్‌లోని కృష్ణానగర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం 'ఈసీఈ డే' సందర్భంగా శారీరక ప్రగతి రిపోర్ట్‌లను అందజేశారు. టీచర్ పి.సావిత్రి మాట్లాడుతూ.. రెండున్నరేండ్ల నుంచి ఐదేండ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య నేర్పించామని అన్నారు. క్రమశిక్షణ, సమయపాలన, వ్యక్తిగత పరిశుభ్రత, మంచి అలవాట్లు, పెద్దలను గౌరవించడం, పుస్తక పఠనం గురించి శిక్షణ ఇచ్చామని తెలిపారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల కోసం ప్రతిరోజు పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని తల్లిదండ్రులను కోరారు. ఐదేండ్లు నిండిన పిల్లలను స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని సూచించారు. గాంధీ దవాఖాన ఆరోగ్య కేంద్రం పీహెచ్ఎన్ సత్యమ్మ, ఆశా వర్కర్ రజనీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు రిపోర్టులను ఇచ్చిన టీచర్ సావిత్రి